సాక్షి రంగారెడ్డి

I

బుధవారం । 5 । జూన్ । 2024



మూడంచెల భద్రత

సార్వత్రిక సమరంలో తుది ఘట్టమైన కౌంటింగ్‌కు ఎన్నికల కమిషన్ మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేసింది. IIలో▸



విద్యుత్ తీగలు ఆనుకొని..

గాలి దుమారం రావడంతో తీగలు ఆనుకొని విద్యుత్ స్తంభంపై ఒక్కసారిగా మంటలు ఎగిసి పడ్డాయి. IIలో▸



మహేశ్వరంలో కొండా హవా

మహేశ్వరం నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి భారీ ఆధిక్యం సాధించారు. IIలో▸

న్యూస్‌రీల్

జాతీయ రహదారిపై కూలిన భారీ వృక్షం

- తప్పిన పెను ప్రమాదం
- కిలోమీటర్ల మేర నిలిచిపోయిన ట్రాఫిక్



చేవెళ్ల మండలం మిర్జాగూడ గేటు సమీపంలో కూలిన మర్రి చెట్టు

చేవెళ్ల/మొయినాబాద్: ఈదురుగాలులతో కూడిన వర్షానికి హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై భారీ మర్రి వృక్షం కూలింది. చేవెళ్ల మండల పరిధిలోని మిర్జాగూడ గేటు సమీపంలో రోడ్డుకు అడ్డంగా మర్రి వృక్షం పడడంతో రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. మంగళవారం చేవెళ్ల మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. బలమైన ఈదురుగాలులు వీయడంతో మర్రివృక్షం రోడ్డుపై కూలింది. రోడ్డుకు అడ్డంగా పడటంతో మన్నెగూడ–చేవెళ్ల మధ్యలో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. రెండు వైపుల సుమారు మూడు కిలోమీటర్ల దూరం ట్రాఫిక్ జాం అయ్యింది. చెట్టు కూలిన సమయంలో రోడ్డుపై వాహనాలేమీ వెళ్లకపోవడంతో ప్రమాదం తప్పింది. చేవెళ్ల ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని జేసీబీల సాయంతో చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

రావి నారాయణరెడ్డికి ఘన నివాళి



రావి నారాయణరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

హయత్‌నగర్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీనియర్ కమ్యూనిస్ట్ నేత రావి నారాయణరెడ్డి 117వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ పరిధిలోని రావినారాయణరెడ్డి కాలనీలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. స్థానిక కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు ముత్యాల యాదిరెడ్డి, ఆజ్మీరా హరిసింగ్‌నాయక్, ముత్యాల యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొత్తం ఓట్లు	29,38,370	పోలైనవి	16,57,107
అభ్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు	శాతం
కొండా విశ్వేశ్వర్‌రెడ్డి	బీజేపీ	8,09,882	48.34
గడ్డం రంజిత్‌రెడ్డి	కాంగ్రెస్	6,36,985	38.02
కాసాని జ్ఞానేశ్వర్	బీఆర్‌ఎస్	1,78,968	10.68

కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మెజార్టీ

1,72,897

ప్రజలకు సేవ చేసే అదృష్టం

చేవెళ్ల ప్రజలు ఎంతో తెలివైన వారు.. దేశానికి సేవ చేసే నాయకులు ఉండాలనే బీజేపీని గెలిపించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తా. నన్ను ఆశీర్వదించి గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు. ఈ ప్రాంతంలో బీజేపీ ఎమ్మెల్యేలు లేకున్నా, స్థానిక ప్రజాప్రతినిధులు లేకపోయినా దేశానికి సేవ చేసే మోదీయే, బీజేపీనే ఉండాలనే ఆలోచనతో మా పార్టీని గెలిపించారు. గతంలో ఎంపీగా, ప్రతిపక్ష నాయకుడిగా ప్రజలకు ఎలా సేవ చేశానో అలాగే ఎంపీగా మరోసారి ప్రజలకు సేవ చేసే అదృష్టం దక్కింది. లోక్‌సభలో చేవెళ్ల ప్రాంత సమస్యలను ప్రస్తావించి అభివృద్ధికి కృషి చేస్తా.



ప్రొఫైల్

భార్య: సంగీతారెడ్డి, కొడుకు అనిందిత్‌రెడ్డి
తల్లిదండ్రులు: జస్టిస్ కొండా మాధవరెడ్డి, జయలతారెడ్డి
స్వస్థలం: ధర్మసాగర్, చేవెళ్ల మండలం
విద్యార్హత: ఇంజనీరింగ్ కంప్యూటర్ సైన్స్
రాజకీయ ప్రస్థానం: 2014లో టీఆర్‌ఎస్ నుంచి ఎంపీగా విజయం 2024లో బీజేపీ నుంచి లోక్‌సభ అభ్యర్థిగా గెలుపు

కొండంత గెలుపు

చేవెళ్లలో కమల వికాసం

- అసెంబ్లీకి భిన్నంగా లోక్‌సభ ఓటింగ్
- కొండాకు జై కొట్టిన మెజార్టీ ఓటర్లు
- మొదటి రౌండ్ నుంచీ అదే ఆధిక్యత
- రెండోసారి లోక్‌సభలో అడుగు పెట్టబోతున్న విశ్వేశ్వర్‌రెడ్డి
- ఓటమిని అంగీకరించి మధ్యలోనే వెనుదిరిగిన సిట్టింగ్ ఎంపీ, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: చేవెళ్ల లోక్‌సభ స్థానంలో కమలం వికసించింది. అసెంబ్లీ ఎన్నికలకు భిన్నంగా ఇక్కడి ఓటర్లు తీర్పు ఇచ్చారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్క చోట కూడా గెలవలేక పోయినప్పటికీ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డికే ఓటర్లు జై కొట్టారు. అంచనాలకు భిన్నంగా మొదటి రౌండ్ నుంచి బీజేపీ తన ఆధిక్యత ప్రదర్శించింది. కాంగ్రెస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి ముందే ఓటమిని అంగీకరించారు. మధ్యాహ్నమే కౌంటింగ్ కేంద్రం నుంచి వెనుదిరిగారు. విజయం కోసం శక్తివంచన లేకుండా కృషి చేశానని, మోదీ హవా ముందు తాను నిలబడలేక పోయానని, తన ఓటమికి తానే కారణమని ప్రకటించుకున్నారు. ఇదిలా ఉంటే 2014లో బీఆర్‌ఎస్ నుంచి ఇదే స్థానం నుంచి తొలిసారిగా ఎంపీగా గెలుపొంది, లోక్‌సభలో అడుగుపెట్టిన మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి.. ఆ తర్వాత 2019లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజాగా 2024లో బీజేపీ నుంచి పోటీ చేసి భారీ విజయం సాధించారు. రెండోసారి ఆయన లోక్‌సభలో అడుగుపెట్టబోతున్నారు. బీఆర్‌ఎస్ నుంచి బరిలో నిలిచిన కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మూడో స్థానంలో నిలిచారు.

ప్రశ్నార్థకంగా రంజిత్‌రెడ్డి భవితవ్యం

పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైంది. ఇదే సమయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, వికారాబాద్ బీఆర్‌ఎస్ సిట్టింగ్ జెడ్పీ చైర్ పర్సన్ పట్నం సునీతారెడ్డి చేవెళ్ల లోక్‌సభ స్థానంపై దృష్టి సారించారు. సీఎం రేవంత్ రెడ్డి హామీ మేరకు వారు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. చేవెళ్ల నుంచి సునీతారెడ్డి పోటీ చేయడం ఖాయమనే సంకేతాలు పార్టీ కేడర్‌కు ఇచ్చారు. తీరా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత సంస్థాగతంగా అనూహ్య రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డికి ఆ పార్టీ మళ్లీ టికెట్ ఖరారు చేయగా ఆయన పోటీకి నిరాకరించి, కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. అప్పటి వరకు ఈ సీటుపై గంపెడాశలు పెట్టుకున్న సునీతా మహేందర్ రెడ్డిని మల్కాజిగిరి నుంచి బరిలో నిలిపారు. రెండు చోట్ల ఇద్దరు అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. ఆశించిన దానికి భిన్నంగా ఓటర్లు తీర్పు ఇవ్వడంతో సిట్టింగ్ ఎంపీ రంజిత్ సహా జెడ్పీ చైర్ పర్సన్ సునీతారెడ్డి దంపతుల రాజకీయ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ఎంపీ ఎన్నికల్లో ఓటమి పాలైన సునీతకు మళ్లీ జెడ్పీ పీఠం కట్టబెడతారా? ఒకవేళ ఇచ్చినా..ఆమె గెలుపొందుతారా? అనేది సందేహమే. ఇక స్థానికేతరుడిగా ముద్రపడిన రంజిత్‌రెడ్డి ఇకపై కూడా చేవెళ్లనే అంటిపెట్టుకుని ఉంటారా? లేక మరో స్థానాన్ని ఎంచుకుంటారా? వేచి చూడాల్సిందే.

ఓటింగ్ శాతం ఇలా..

చేవెళ్ల లోక్‌సభ స్థానంలో మొత్తం 43 మంది పోటీ పడ్డారు. 56.40 శాతం ఓటింగ్ నమోదైంది. అత్యధికంగా చేవెళ్లలో 71.83 శాతం నమోదు కాగా, 70.44 శాతం, తాండూరులో 67.33 శాతం, పరిగిలో 67.01 శాతం, రాజేంద్రనగర్‌లో 54.12 శాతం, మహేశ్వరంలో 52.71 శాతం, శేరిలింగంపల్లిలో అతి తక్కువగా 43.91 శాతం ఓటింగ్ నమోదైంది. ఓట్ల లెక్కింపు కోసం మొత్తం 165 టేబుళ్లు ఏర్పాటు చేశారు. అత్యధికంగా శేరిలింగంపల్లిలో 23 రౌండ్లు, చేవెళ్ల, పరిగి 22 రౌండ్లు, మహేశ్వరం, రాజేంద్రనగర్ 20 రౌండ్ల చొప్పున ఓట్లను లెక్కించారు. వికారాబాద్ 21 రౌండ్లు, తాండూరు 20 రౌండ్ల చొప్పున లెక్కించారు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించారు.



కలెక్టర్ శశాంక చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

రౌండ్ల వారీగా..

రౌండ్	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్‌ఎస్
1	28,648	42,568	10,079
2	26,316	42,738	7,880
3	23,210	39,509	7,721
4	29,936	36,494	7,944
5	28,875	40,550	7,160
6	27,442	41,344	8,792
7	27,366	38,795	7,644
8	26,633	2,922	8,655
9	22,982	48,015	7,183
10	38,029	36,725	7,689
11	37,812	32,693	6,612
12	43,025	28,272	6,939
13	32,255	37,015	8,120
14	34,553	36,210	7,836
15	37,548	35,732	7,978
16	27,189	43,475	8,410
17	30,167	41,465	11,414
18	32,824	37,681	10,046
19	29,709	38,830	12,147
20	20,334	25,968	6,521
21	12,535	15,344	5,118
22	9,625	10806	3,932
23	3,372	5,011	1,600
24	476	354	120

ఆరు నెలల్లో ఎంత మార్పు

- అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఆధిక్యం
- లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ హవా
- బీజేపీకి మారిన బీఆర్‌ఎస్ ఓటు బ్యాంకు

మొయినాబాద్: అసెంబ్లీ ఎన్నికలు జరిగిన ఆరు నెలల్లోనే చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గంలో భారీగా మార్పు చోటుచేసుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు స్వల్ప మెజార్టీ ఇచ్చిన చేవెళ్ల ఓటర్లు లోక్‌సభ ఎన్నికలకు వచ్చే సరికి బీజేపీకి భారీ మెజార్టీ కట్టబెట్టారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు వచ్చిన ఓట్లను బట్టి చూస్తే బీఆర్‌ఎస్ ఓటు బ్యాంకు బీజేపీకి షిఫ్ట్ అయినట్లు స్పష్టమవుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రమంతా కాంగ్రెస్ వేవ్ కనిపించినా చేవెళ్లలో బీఆర్‌ఎస్ 276 ఓట్ల స్వల్ప మెజార్టీతో విజయం సాధించింది. లోక్‌సభ ఎన్నికలు వచ్చేసరికి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా దేశంలో మోదీ వేవ్ కనిపించింది. మరో వైపు చివరి నిమిషంలో బీఆర్‌ఎస్ చేతులెత్తేయడంతో ఆ పార్టీ ఓటు బ్యాంకు బీజేపీ వైపు మొగ్గింది. బీఆర్‌ఎస్ ఓటు బ్యాంకులోని హిందువులు బీజేపీవైపు మొగ్గితే.. మైనార్టీలు మాత్రం కాంగ్రెస్ వైపు మొగ్గినట్లు ప్రచారం జరిగింది. కాంగ్రెస్‌కు సైతం గత అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లకంటే లోక్‌సభ ఎన్నికల్లో 4,256 ఓట్లు తక్కువగా వచ్చాయి. దీన్ని బట్టి చూస్తే కాంగ్రెస్ ఓట్లు సైతం బీజేపీకి పడ్డాయని స్పష్టమవుతోంది.

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు వచ్చిన ఓట్ల వివరాలు

పార్టీ	2023 అసెంబ్లీ ఎన్నికలు	2024 లోక్‌సభ ఎన్నికలు	తేడా
బీఆర్‌ఎస్	76,210	21,064	–55,146
కాంగ్రెస్	75,934	71,678	–4,256
బీజేపీ	38,450	93,778	+55,328

ఓటమిని అంగీకరిస్తున్నా

- పూర్తి బాధ్యత నాదే..
- చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: ఓటమిని అంగీకరిస్తున్నానని.. దీనికి పూర్తి బాధ్యత తనదేనని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. చేవెళ్లలోని బండారు శ్రీనివాస్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రం నుంచి మధ్యలోనే ఆయన బయటకు వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీకి ఊహించినదానికంటే ఎక్కువ మెజార్టీ వచ్చిందన్నారు. నిజంగా ఇంత వేవ్ ఉందని అనుకోలేదని.. పట్టణ ప్రాంతంలో ఎక్కువగా ప్రభావం చూపిందన్నారు. తన కోసం కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు శాయశక్తులా కష్టపడ్డారని అన్నారు. ఓటమిని అంగీకరిస్తూ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరినీ మన్నించమని అడుగుతున్నానన్నారు. విజయం సాధించిన విశ్వేశ్వర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ మారడం ఓటమికి కారణమా అని అడిగిన ప్రశ్నకు ఓటమికి ఎన్నో కారణాలు ఉన్నాయని.. తానే స్వయంగా ఓటమిని అంగీకరిస్తున్నానని స్పష్టం చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

కల్వకుర్తిలో కాంగ్రెస్‌కు మెజార్టీ

- 11,827 ఓట్ల ఆధిక్యం
- ఎమ్మెల్యే ఎన్నికల్లో 5,410 ఓట్ల మెజార్టీ



కుటుంబ సభ్యులతో కలిసి విజయాన్ని పంచుకుంటున్న మల్లురవి

ఆమనగల్లు: లోక్‌సభ ఎన్నికల్లో కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ అభ్యర్థి డా.మల్లురవికి 11,827 ఓట్ల మెజార్టీ వచ్చింది. గత డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి 5,410 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. గత ఎన్నికలతో పోలిస్తే ఆ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో కల్వకుర్తిలో 6,417 ఓట్లు అధికంగా వచ్చాయి. మల్లురవి 94,414 ఓట్ల మెజార్టీతో బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌పై విజయం సాధించారు. మొదటి నుంచి ఊహించినట్లుగానే కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ మెజార్టీ దక్కించుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో కసిరెడ్డి నారాయణరెడ్డికి 75,858 ఓట్లు రాగా బీజేపీ అభ్యర్థి ఆచారికి 70,448 ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌కు 42,847 ఓట్లు వచ్చాయి. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవికి 63,720 ఓట్లు, బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు 51,177 ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్‌కు 51,893 ఓట్లు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే బీఆర్‌ఎస్‌కు దాదాపు 9 వేల ఓట్లు అధికంగా రావడం విశేషం.

కల్వకుర్తి అసెంబ్లీ ఓట్ల వివరాలు

డా.మల్లురవి	కాంగ్రెస్	63,720
భరత్‌ప్రసాద్	బీజేపీ	51,177
ప్రవీణ్‌కుమార్	బీఆర్‌ఎస్	51,893

కాంగ్రెస్‌వైపే షాద్‌నగర్ ఓటర్లు

- 13 రౌండ్లలో కాంగ్రెస్‌కు, 6 రౌండ్లలో బీజేపీ ఆధిక్యం
- మూడో స్థానానికి పరిమితమైన బీఆర్‌ఎస్

షాద్‌నగర్: మహబూబ్‌నగర్ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో షాద్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో కాంగ్రెస్, బీజేపీ మధ్య ప్రధాన పోటీ నెలకొంది. చివరికి ఓటర్లు కాంగ్రెస్ పార్టీ వైపే నిలిచారు. ఈ అసెంబ్లీ సెగ్మెంట్‌లో మొత్తం 2,38,478 ఓట్లు ఉండగా 263 పోలింగ్ కేంద్రాల్లో 1,84,578 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 19 రౌండ్ల ఓట్ల లెక్కింపులో 13 రౌండ్లలో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ఆధిక్యాన్ని కనబర్చగా, బీజేపీ 6 రౌండ్లలో మాత్రమే ఆధిక్యాన్ని ప్రదర్శించింది.

కాంగ్రెస్‌కు ఆధిక్యం

షాద్‌నగర్‌లో అసెంబ్లీ సెగ్మెంట్‌లో కాంగ్రెస్, బీజేపీ మధ్య హోరాహోరా పోటీ జరిగింది. కాంగ్రెస్‌కు 76,100 ఓట్లు పోలవగా, బీజేపీకి 68,096 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 31,668 ఓట్లు పోలయ్యాయి. మొత్తం మీద కాంగ్రెస్‌కు 8,004 ఓట్లు బీజేపీ కంటే అధికంగా పోలయ్యాయి.

పెరిగిన మెజార్టీ.. తగ్గిన ఓట్లు

అసెంబ్లీ ఎన్నికల కంటే లోక్‌సభ ఎన్నికల్లో షాద్‌నగర్ అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీకి స్వల్పంగా ఓట్ల మెజార్టీ పెరిగింది. అసెంబ్లీ ఎన్నికల్లో 77,817 ఓట్లు పోలవగా, లోక్‌సభ ఎన్నికల్లో 76,100 ఓట్లు పోలయ్యాయి.

బీజేపీకి భారీగా పోలింగ్

అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో భారీగా పోలింగ్ నమోదైంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి 8,164 ఓట్లు పోలవగా, లోక్‌సభ ఎన్నికలకు వచ్చే సరికి 68,096 ఓట్లు పోలయ్యాయి. బీఆర్‌ఎస్ ఓట్లు బీజేపీకి భారీగా క్రాస్ అయినట్లు తెలుస్తోంది.

మూడోస్థానానికే బీఆర్‌ఎస్ పరిమితం

2019 లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు మధ్య పోటాపోటీ జరిగింది. అప్పట్లో బీజేపీకి 40,329ఓట్లు, కాంగ్రెస్‌కు 40,0091 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 67,399 ఓట్లు పోలయ్యాయి. ప్రస్తుతం బీఆర్‌ఎస్ 31,668 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. గత ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి షాద్‌నగర్‌లో 27,070 ఓట్ల అధిక్యం వచ్చింది.

‘పట్నం’ నుంచి కాంగ్రెస్‌కు స్వల్ప మెజార్టీ

ఇబ్రహీంపట్నం: లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి పరిధిలోకి వచ్చే ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య హోరాహోరీ పోరు సాగింది. ఈ సెగ్మెంట్‌లో కాంగ్రెస్ 3,969 ఓట్ల స్వల్ప మెజార్టీ సాధించింది. అసెంబ్లీ ఎన్నికల తీర్పునకు భిన్నంగా లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు ఓటు వేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ద్వితీయ స్థానంలో ఉన్న బీఆర్‌ఎస్‌ను లోక్‌సభ ఎన్నికలు వచ్చేసరికి మూడో స్థానానికి పరిమితం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో 3,39,341 మంది ఓటర్లకుగాను 2,26,790 మంది ఓటు వేశారు. అసెంబ్లీ ఎన్నికలకంటే లోక్‌సభ ఎన్నికల్లో 18 వేల ఓట్లు తక్కువగా పోలయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి 1,26,506 ఓట్లు సాధించి 36,700 వేల భారీ మెజార్టీని సొంతం చేసుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి 88,013 ఓట్లు పొంది 3,969 ఓట్ల స్వల్ప మెజార్టీ సాధించారు. 38 వేల పైచిలుకు ఓట్లు తగ్గాయి. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి 89,806 ఓట్లు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి క్యామ మల్లేశ్ 39,541 ఓట్లతో తృతీయ స్థానంలో నిలిచారు. 50 వేల పైచిలుకు ఓట్లను లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ కోల్పోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి నోముల దయానంద్‌గౌడ్ 15,790 ఓట్లకే పరిమితమైతే లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ 84,044 ఓట్లతో ద్వితీయ స్థానంలో నిలిచారు. అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థి పి.యాదయ్యకు 3,948 ఓట్లు రాగా లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి ఎండీ జహంగీర్ 5,691 ఓట్లు సాధించారు. యాచారం, మంచాల గ్రామీణ మండలాలు కాంగ్రెస్‌కు లీడ్ ఇవ్వగా, అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం అర్బన్ మండలాలు బీజేపీవైపు మొగ్గు చూపాయి.

క్లుప్తంగా

స్థానిక సంస్థల బలోపేతానికి కృషి

ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: స్థానిక సంస్థలను బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట శివారులో ఉన్న అంబ భవానీ దేవాలయంలో నూతనంగా ఎన్నికైన మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యలపై శాసన మండలిలో తన గళాన్ని వినిపిస్తానని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు అండగా నిలిచి గెలుపునకు కృషి చేసిన వారందరికీ రుణపడి ఉంటానని అన్నారు. దేవాలయానికి విచ్చేసిన ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డిని స్థానిక నాయకులు పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బెంది శ్రీనివాస్‌రెడ్డి, కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, శివాచారి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన నిర్మాణాల కూల్చివేత

అత్తాపూర్ : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన ఇళ్లను కూల్చివేసినట్లు రాజేంద్రనగర్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ కె. రవికుమార్ తెలిపారు. ఇటీవల బాబుల్‌రెడ్డినగర్‌లో గోడకూలిన ఘటనలో చిన్నారులు మృతిచెందిన విషయం విషాదకరమన్నారు. శిథిలావస్థకు చేరిన నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించుకుంటే ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉంటాయని సూచించారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ.. జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

చిన్నారికి పెద్ద కష్టం

- అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఎనిమిది నెలల పసికందు
- ఆపరేషన్‌కు రూ.30 లక్షల ఖర్చు
- సహాయం కోసం తల్లిదండ్రుల ఎదురుచూపులు



చిన్నారి ఆరాధ్య

ఇబ్రహీంపట్నం రూరల్: తల్లి గర్భం నుంచే తన్నడం ప్రారంభించిన బిడ్డను కంటికి రెప్పలా అమ్మానాన్నలు కాపాడుకుంటారు. పిల్లలు ఎదిగే కొద్దీ ఉబ్బి తబ్బిబవుతారు. చిన్నారులకు ఏ చిన్న ఆపద కలిగినా విలవిలలాడుతారు. అలాంటిది ఓ చిన్నారి అరుదైన వ్యాధితో బాధపడుతుండటాన్ని ఆ తల్లిదండ్రులు తట్టుకోలేకపోతున్నారు. వైద్యం చేయించే స్థోమత లేని దంపతులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. తమ పాపను బతికించడానికి సాయం చేయాలని తెలిసినవారినల్లా ప్రార్థిస్తున్నారు. ఇదీ ఇబ్రహీంపట్నం మండలంలోని పోల్కంపల్లిలో రాజశేఖర్ తేజశ్రీ దంపతుల పరిస్థితి. గ్రామానికి చెందిన రాజశేఖర్ తేజశ్రీలకు ఆరాధ్య అనే 8 నెలల కూతురు ఉంది. రాజశేఖర్ ఆటో నడిపి జీవనం సాగిస్తుంటాడు. వీరి కూతురు గత కొద్దిరోజులుగా అనారోగ్యానికి గురయ్యింది. ఆస్పత్రులు తిప్పగా బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని వైద్యులు సూచించారు. లేదంటే పాపకు జీవ ప్రక్రియ మందగించి క్రమంగా ఆరోగ్యం క్షీణిస్తుంది. వీలైనంతా త్వరగా ఆపరేషన్ చేస్తే పాప ప్రాణాలతో దక్కుతుందని వైద్యులు చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స చేయలేమని చెప్పడంతో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించారు. ఆపరేషన్‌కు ఏకంగా రూ.30 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పడంతో తల్లిదండ్రులు దిక్కుతోచనిస్థితిలో సాయానికి అర్థిస్తున్నారు. మానవతావాదులు స్పందించాలని కోరుతున్నారు. దాతలు సహకరిస్తే తప్పకుండా తమ బిడ్డ ప్రాణాలు కాపాడవచ్చని దంపతులు వేడుకుంటున్నారు. గూగుల్‌పే, ఫోన్‌పే నంబరు 95057 67104 అందుబాటులో ఉంటుందని తెలిపారు. పొన్నాల రాజశేఖర్ అకౌంట్ నంబరు 13891201000334, యూనియన్ బ్యాంక్ ఇబ్రహీంపట్నం బ్రాంచ్‌లో నగదు జమ చేయాలని కోరారు.

కౌంటింగ్‌కు మూడంచెల భద్రత

- భోజన ఏర్పాట్లలో అధికారులు విఫలం



అన్నం వడ్డించుకుంటున్న పోలీసులు



కౌంటింగ్ కేంద్రంలో భోజనానికి క్యూ కట్టిన పోలీసులు, ఏజెంట్లు, సిబ్బంది తదితరులు

చేవెళ్ల: సార్వత్రిక సమరంలో తుది ఘట్టమైన కౌంటింగ్‌కు ఎన్నికల కమిషన్ మూడంచెల భద్రతా ఏర్పాటు చేసింది. చేవెళ్లలోని బండారు శ్రీనివాస్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రానికి మంగళవారం ఉదయం 6 గంటల నుంచే కౌంటింగ్ సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్లు, మీడియా ప్రతినిధులు చేరుకున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లకు ఎన్నికల కమిషన్ ద్వారా జారీ చేసిన పాసులను గమనించి లోపలికి పంపించారు. పాసులు లేనివారిని కౌంటింగ్ కేంద్రం దరిదాపుల్లోకి కూడా రానివ్వలేదు.

రౌండ్ల వారీ ఫలితాల్లో లేటుగా స్పందన

పార్లమెంటు ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద వసతుల కల్పనలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు, మీడియా ప్రతినిధులు, పోలీసులు ఎంత మంది ఉన్నారో ముందే గుర్తించిన అధికారులు అందరికీ సరిపడా ఏర్పాట్లను మాత్రం చేయలేదు. ఉదయమే కౌంటింగ్ కేంద్రానికి వచ్చిన వారికి టిఫిన్ సరిగా ఇవ్వలేదు. అదే విధంగా మధ్యాహ్నం భోజనం కూడా సరిపడా పెట్టలేదు. భోజనం సమయంలో పోలీసులు, ఏజెంట్లు,మీడియా ప్రతినిధులు భారీగా క్యూకట్టారు. భోజన సమయంలో అందరూ చాలాఇబ్బందులకు గురయ్యారు.అదే విధంగా రౌండ్ల వారీగా ఎన్నికల ఫలితాలను మీడియా ప్రతినిధులకు తెలియజేయడంలోనూ అధికారులు అలసత్వం వహించారు.



నస్దిక్‌సింగారం-అయ్యవారిగూడెం రోడ్డు దుస్థితి

గుంతల దారి.. అవస్థలే మరి!

- 20 ఏళ్లుగా ఇబ్బంది పడుతున్న నస్దిక్‌సింగారం-అయ్యవారిగూడెం గ్రామస్తులు

యాచారం: కంకర తేలి కాలినడకకు సైతం వీల్లేకుండా మారిన రోడ్డుతో స్థానికులు 20 ఏళ్లుగా సావాసం చేస్తున్నారు. రహదారికి మరమ్మతులు చేయాలని అధికారులకు అనేకసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. గుంతల రోడ్డులో వెళ్లలేక ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇదీ మండలంలోని నస్దిక్‌సింగారం-అయ్యవారిగూడెం గ్రామాల మధ్యన ఉన్న రోడ్డు దుస్థితి. ఈ గ్రామాల మధ్య దాదాపు రెండున్నర కిలోమీటర్ల దూరం ఉంది. 20 ఏళ్ల కిందట ఈ రోడ్డుకు మరమ్మతులు చేసి కంకర పోసి వదిలేశారు. నాటి నుంచి నేటి వరకు రహదారిపై గంప మట్టిని పోసిన దాఖలాలు లేవు. వర్షాలు కురిస్తే రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నీళ్లు నిలవడంతో గ్రామస్తులు అనేకసార్లు వరినాట్లు వేసి నిరసన సైతం వ్యక్తం చేశారు. అయినా అధికారుల్లో గాని, ప్రజాప్రతినిధుల్లో గాని చలనం రాలేదు. ఎన్నికల సమయంలో రోడ్డుకు మరమ్మతులు చేస్తామని హామీ ఇచ్చిన నాయకులు గెలిచిన తర్వాత మొహం చాటేస్తున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని రోడ్డుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని రెండు గ్రామాల ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

విషాదం మిగిల్చిన విహారయాత్ర

రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం, ఇద్దరికి గాయాలు



శభరీశ్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపడానికి యాత్రకు వెళ్లారు. అనంతరం దైవ దర్శనానికి బయలు దేరారు. అంతలోనే అనుకోని ఉపద్రవం ఎదురైంది. ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌కు చెందిన ఓ కుటుంబం చేపట్టిన విహారయాత్ర విషాదాన్ని నింపింది. రోడ్డు ప్రమాదం రూపంలో బాలుడిని బలిగొన్న ఘటన స్థానికంగా కలచివేస్తోంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తాళ్ల దర్శన్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం మూడు కార్లల్లో విహారయాత్రకు వెళ్లారు. యాత్రలో భాగంగా భద్రాచలం నుంచి ములుగు జిల్లా మీదుగా తాడ్వాయి గుండా సమ్మక్క సారక్క వైపు వెళ్తుండగా మంగళవారం తెల్లవారుజామున కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో తాళ్ల అరుణ్ కుమారుడు శభరీశ్(9) అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నడుపుతున్న అరుణ్, అతడి తండ్రి దర్శన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికంగా ప్రథమ చికిత్స అనంతరం ఇద్దరినీ నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దర్శన్(60) పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. తండ్రీతాతలు ఆస్పత్రిలో ఉండగా పిల్లాడి అంత్యక్రియలకు కుటుంబ సభ్యులు సిద్ధం చేశారు. దీంతో కొంగరకలాన్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

BUILDING MATERIAL

■ అన్ని నిర్మాణ అవసరాలకు నాణ్యమైన నిర్మాణ ఇసుక సరసమైన ధరలకు అందిస్తున్నాము. 25 కిలోల బ్యాగులో లభ్యం అవుతుంది మరియు పెద్ద ఆర్డర్లకు ఇసుక టన్నుల్లో లభిస్తుంది. సంప్రదించండి: 8187036931, 7660011002 [H-778852]

HOUSE FOR SALE

■ హయత్‌నగర్ మునగనూరు బ్యాంక్ కాలనీలో 200 గజాలు S/F, 1600 Sft. కొత్త ఇల్లు అమ్మకానికి కలదు. డ్రాగునీరు, డ్రైనేజి కూడా కలదు. కేవలం 97 లక్షలు మాత్రమే. ఫోన్: 9849688626. [HA-1598]

PLOT FOR SALE

■ గజం 2499/-కే విజయవాడ హైవే నార్కట్‌పల్లి దగ్గర 4లైన్ల రోడ్డు ప్రక్కన ఫామ్ ల్యాండ్ వెంచర్‌లో స్విమ్మింగ్ పూల్, ఫామ్ హౌస్, ఎర్రచందనం, పండ్ల మొక్కలతో 1210గజాలు (10గుంటలు) ప్లాట్స్ కలవు. సంప్ర॥ 9666695886 [G-3152]

■ షాద్‌నగర్ @ కేంపేట టౌన్‌లో DTCP లేఅవుట్ ఫుల్ డెవలప్‌మెంట్స్‌తో 0% ఇంట్రెస్టుతో 40 EMI పద్ధతిలో ఓపెన్ ప్లాట్స్ కలవు. డైరెక్ట్ కంపెనీ ఆఫర్, సైట్ విజిట్ కొరకు. సంప్ర: 9949695027 [H-796162]

■ 2750/- Per Sq. Yds, Near balanagar, From Bangalore Highway 3 years Fruit Plants Guest House Swimming Pool Red Soil. Ph: 9347986771 [HA-32240]

RENT

■ Godown for Rent: 5000 to 10000 Sq.ft. Godown at Mallapur Indl., Boduppal. Ph: 9566030606 [QA-259]

Services

■ కోర్టు కేసులతో బాధపడుతున్నారా? NOC ఇబ్బందులు ఉన్నాయా? మీ కేసులు మీరే వాదించుకోండి. (Party in Person) మీకు న్యాయ సలహాలు ఇస్తాము. GLS, L.B. Nagar, HYD. ఫోన్: 7888011777, 7702771628 [HA-14365]

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739. [H-800406]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, Pedavalli Venkateshwara Rao S/o Late P. Sathyanarayana R/o H.No. 1-30-347/3, Kanajiguda, Tirumalgiri, Secunderabad - 500015, changed my name from Pedavalli Venkateshwar Rao to Pedavalli Venkateshwara Rao for all record purpose. [HA-97517]

■ It is for general information that I, KOGURU SWETHA, D/o KOGURU NARSIHMA REDDY, R/o H.No.5-34, SNC-104/A/1, Sainath Colony, Injapur, Post-Ragannaguda X Roads, Abdullapurmet, Dist.-Rangareddy, Telangana - 501510, declare that my name has been wrongly written as RACHAKONDA MADHU in my SSC, Inter, B.Tech, Master's Certificate cum Marskheet, my actual name is KOGURU SWETHA which may be amended accordingly [HA-11147]

OLD AGE HOME

■ వృద్ధులు & భార్యాభర్తలు A/C & N/C అటాచ్డ్ బాత్రూం, మేడిపల్లి / ఉప్పల్, వృద్ధులు, బెడ్ పేషెంట్లు. Eoil, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతి మరియు 24/7 మెడికల్ సర్వీస్. ఫోన్: 7981467086, 9391039990, 9515474083. [H-778801]

PEST CONTROL

■ ప్రభుత్వ గుర్తింపుగల వి.శారద పెస్ట్ కంట్రోల్ చెదలు, 2BHK 3000, 3BHK 4000, బొద్దింకలు, బల్లులు వాసనలేని జెల్ స్ప్రే. ఫోన్: 7993180649. [HA-97485]

TOURS & TRAVELS

■ సాయిటూర్స్: జూన్ 17 సోమనాథ్, ద్వారక, ఉజ్జయిని జూలై 2 రాజస్థాన్ టూర్, జూలై 13 మహారాష్ట్ర టూర్, అష్టవినాయకులు, షిరిడి, భీమశంకర్, జూలై 21 కర్ణాటక, జూలై 22 రామేశ్వరం, అగస్టు 24 కాశీ. ఫోన్: 9848664831 [HA-796068]

Wanted

■ అనుభవం గల లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ నాలెడ్జ్, జీతం 10-12K సంప్ర: ఆస్ట్రాలజీ ఆఫీస్, విద్యానగర్. 7842386296 [HA-14364]

■ గోదారోళ్ళ సుబ్రహ్మణ్యం గారి భోజనం హోటల్ NH-65 చౌటుప్పల్, లక్కారం (V.V.R Gardens) వద్ద పనిచేయుటకు 35 సం॥లోపు భార్యాభర్తలు కావలెను. భోజనం మరియు వసతి సౌకర్యం కలదు. జీతం : 20 వేలు. సెల్ : 96666 36108, 96666 83108 [YA-15434]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్సును చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీతం : 18K. Ph : 9160900024, 9640400073 [H-799887]

■ BiPC ల్యాబ్‌కర్స్, హోం ట్యూటర్స్, రిసెప్షన్, టీ॥ కా॥, ఆఫీస్ బాయ్, సైన్స్ టీచర్స్, వీడియోఎడిటింగ్, DTP, డ్రైవర్లు, సూ॥వై॥, ఆయాలు, కుక్స్, హెల్పర్స్, గార్డెన్ వర్కర్స్, జీ॥ 15-18K, ఫ్రీ హాస్టల్ - నో ఫీజు. ఫోన్: 9505288777 [H-778732]

■ గృహిణి/రిటైర్డ్/ప్రైవేట్ జాబ్ EMP సువర్ణ అవకాశం. మీకు నచ్చిన సమయంలో మీ ఇంట్లో 1 లేదా 2 గం॥ పనిచేయండి. మీకు కావలసినంత సంపాదించండి. Q: 10th. ఫీజు లేదు. ఫోన్: 9866829707 [HA-32255]

■ శ్రీనగర్ కాలనీ, సాగర్ సొసైటీలో, హౌస్ కీపింగ్‌తోపాటు Toilet క్లీనింగ్ చేయుటకు M/F, జీ: 14,000/- 9 గం॥ & మణికొండలో సె॥గార్డ్స్ కావలెను. సంప్ర: 9177364335 [H-778731]

■ అర్జెంటుగా బండ్లగూడ జాగీర్ ప్రముఖ స్కూల్ కొరకు స్వీపర్స్, బాత్ రూమ్ క్లీనర్లు, గార్డెనర్లు కావలెను. కాంటాక్ట్: M.J. Murthy. 9849079995, 9848503670 [HA-13679]

■ అన్నపూర్ణ హోంకేర్ పెద్దవారికి సేవ చేయుటకు, పేషెంట్ కేర్, కేర్ టేకర్స్, ఆయాలు, స్త్రీ/పురుషులు, ANM/ GNM నర్సులు కావలెను. జీతం : 18000/- 30000/- రూమ్ + భోజన సౌకర్యం కలదు. ఫోన్ : 9390427894 [H-788093]

■ ప్రముఖ విద్యాసంస్థకు మేల్ ప్రిన్సిపాల్ కావలెను. వయస్సు: 50సం॥లోపు, శాలరీ: 40,000/- సంప్రదించండి. 9248733323 [G-5399]

■ క్రాంతిరోడ్ ట్రాన్స్‌పోర్ట్ HYD ఆటోనగర్ ఆఫీస్ నందు గుమాస్తాలుగా పనిచేయుటకు 10th ఆపై చదివినవారు 30 సం॥లోపు వయస్సు గల మేల్ అభ్యర్థులు కావలెను. బ్యాచిలర్స్‌కు వసతి సౌకర్యం కలదు ✆ 87901 91999 [B-2]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్

3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు), ప్రతి అదనపు లైనుకు రూ. 540/-

గమనిక : ఇకపై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

విద్యుత్ తీగలు అనుకొని.. మంటలు చెలరేగి



విద్యుత్ స్తంభంపై ఎగిసి పడుతున్న మంటలు

మంచాల: గాలి దుమారం రావడంతో తీగలు అనుకొని విద్యుత్ స్తంభంపై ఒక్కసారిగా మంటలు ఎగిసి పడ్డాయి. దీంతో స్థానికులు భయందోళనకు గురైన సంఘటన మండలంలోని జాపాల గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామంలోని ఆరో వార్డులో ఇళ్లను ఆనుకొని విద్యుత్ స్తంభాలున్నాయి. రాత్రి గాలి దుమారం రావడంతో విద్యుత్ తీగలు ఒకదానికొకటి ఆనుకున్నాయి. దీంతో మంటలు చెలరేగాయి. ప్రజలు చూస్తుండగానే మంటలు మరింతగా వ్యాప్తించాయి. వెంటనే విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విద్యుత్ శాఖ వారికి సమాచారం అందించడంతో వెంటనే వచ్చి పరిశీలించి సమస్యను పరిష్కారం చేశారు. ఇళ్లను ఆనుకొని స్తంభాలు ఉండడంతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయని స్థానికులు వాపోతున్నారు.

ఓట్ల లెక్కింపు ప్రశాంతం

జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా మంగళవారం ఆయన కార్వాన్, నాంపల్లి, యాకుత్‌పురా, చార్మినార్, చాంద్రాయణగుట్ట అసెంబ్లీసెగ్మెంట్ల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలించారు. ఈ ప్రక్రియకు సహకరించిన అధికారులకు, సిబ్బందికి, పోలీస్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల కమిషన్ నియమించిన కౌంటింగ్ అబ్జర్వర్స్ సహకారం మరువలేనిదని పేర్కొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌లోనూ ఈటల ఆధిక్యం

సాక్షి, మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తంగా 18,880 ఉండగా, ఇందులో లక్ష 18,496 బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు 10,330 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డికి 6,230 బ్యాలెట్ ఓట్లు, టీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి 1,787 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ కంటే బీజేపీకి 4,100 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. నోటాకు 160 ఓట్లు రాగా, చెల్లని బ్యాలెట్ ఓట్లు 222 ఉన్నాయి. మిగతా ఓట్లు ఇతర అభ్యర్థులకు పోలైయ్యాయి.

ఓడిన వాళ్లను గెలిపిస్తూ..

ఎమ్మెల్యేగా ఓడిన వారిని ఎంపీలు చేసిన మల్కాజిగిరి

- 2019లో రేవంత్‌రెడ్డికి, నేడు ఈటలకు అండగా

సాక్షి, సిటీబ్యూరో: జీవితంలోనైనా, రాజకీయాల్లోనైనా! రాజు కింకరుడగు.. కింకరుడు రాజగు అన్నట్లు ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. కార్పొరేటర్లుగా ఓడిన వారు ఎమ్మెల్యేలు, మంత్రులైన దాఖలాలూ ఉన్నాయి. అలాగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఓడిన వారిని ఎంపీగా గెలిపించింది మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం. ఆర్నెల్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్, గజ్వేల్ నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఒక్కచోట కూడా గెలవలేకపోయిన ఈటల రాజేందర్‌ను ప్రస్తుతం ఎంపీగా గెలిపించింది. అంతకుముందు రేవంత్‌రెడ్డిని సైతం అలాగే గెలిపించింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఓడిపోయిన రేవంత్‌రెడ్డిని 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీని చేసింది.ఎంపీగా గెలిచాకే రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం పీసీసీ అధ్యక్షునిగా చేసింది. ఆ పదవితో కాంగ్రెస్‌కు నేతృత్వం వహిస్తూ ఆర్నెల్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలవడంతో ఏకంగా ముఖ్యమంత్రి అయ్యారు. ప్రస్తుతం ఈ నియోజకవర్గం నుంచి గెలిచిన ఈటల రాజేందర్‌కూ మంచి రాజకీయ భవిష్యత్ ఉంటుందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

సికింద్రాబాద్ నుంచి కిషన్‌రెడ్డి

ఎంపీ కావడంతో పాటు కేంద్రమంత్రి పదవి కూడా పొందిన కిషన్‌రెడ్డిదీ ఇలాంటి అనుభవమే. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అంబర్‌పేట నుంచి పోటీచేసి ఓటమి పాలైన కిషన్‌రెడ్డి, 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి గెలుపొందారు. పార్టీ అధిష్టానం ఆయనకు మంత్రి పదవి ఇవ్వడమూ తెలిసిందే.

పార్టీ మారినా జాతకం మారలే..

మరోవైపు, పార్టీ మారి గొప్ప రాజకీయ భవిష్యత్ పొందొచ్చని ఆశించిన వారి ఆశలు తల్లకిందులయ్యాయి. గ్రేటర్ పరిధిలో పార్టీ మారి గెలవని వారూ ఉన్నారు. బీఆర్‌ఎస్ నుంచి ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరి సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. అలాగే మూడు పర్యాయాలు జడ్పీ చైర్మన్‌గా ఎన్నికైన పట్నం సునీత సైతం బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరి మల్కాజిగిరి నుంచి ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. గత ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఎంపీగా ఎన్నికైన గడ్డం రంజిత్‌రెడ్డి ఈసారి కాంగ్రెస్‌లో చేరి పోటీచేసి ఓడిపోయారు. అలాగే ఉప్పల్ టిక్కెట్ రాకపోవడంతో కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరి మల్కాజిగిరి ఎంపీగా పోటీ చేసిన రాగిడి లక్ష్మారెడ్డి కూడా ఓడిపోయారు.

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు శుభాకాంక్షల వెల్లువ



శుభాకాంక్షలు తెలుపుతున్న బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, నార్సింగి మున్సిపాలిటీ చైర్మన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్‌లు వికారాబాద్‌లోని గడ్డం ప్రసాద్‌కుమార్ నివాసానికి చేరుకుని పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భవిష్యత్తుల్లో మరిన్ని ఉన్నత పదవులు దక్కించుకుని ప్రజాసేవ చేయాలని ఆకాంక్షించారు. ఏ-బ్లాక్ అధ్యక్షుడు దప్పు నవీన్‌కుమార్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్: స్పీకర్ గడ్డం ప్రసాద్ జన్మదినం సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్‌కు చెందిన దళిత సంఘాల నాయకులు మంగళవారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సంఘాల సభ్యులు శ్రావణ్, నరసింహా తదితరులున్నారు.

మహేశ్వరంలో కొండా హవా

- 16 రౌండ్లల్లో బీజేపీ మెజార్టీ
- కాంగ్రెస్‌పై 50,352 ఓట్ల ఆధిక్యత
- నియోజకవర్గంలో భారీగా క్రాస్ ఓటింగ్

మహేశ్వరం: చేవెళ్ల పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఘన విజయం సాధించారు. ఈ ఓట్ల సమరంలో ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్ మధ్యే పోటీ నెలకొంది. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ నామమాత్రంగానే పోటీ ఇచ్చారు. మహేశ్వరం నియోజకవర్గంలోని ఎన్నికల్లో 52.70 శాతం ఓటింగ్ నమోదై 2,93,387 మంది ఓటర్లు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని మొత్తం 527 పోలింగ్ స్టేషన్లలోని 20 రౌండ్లుగా విభజించి ఓట్ల లెక్కింపు నిర్వహించారు. మొదటగా ఆర్‌కేపురం, సరూర్‌నగర్ డివిజన్ల నుంచి ప్రారంభించగా బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆధిక్యత ప్రదర్శించారు. 5, 6 రౌండ్లు జిల్లెల్‌గూడ, మీర్‌పేట్‌లోనూ బీజేపీదే హవా. 9, 10, 11, 12, 13 రౌండ్లు బండంగ్‌పేట్, జల్‌పల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి (జల్‌పల్లి), విశ్వేశ్వర్‌రెడ్డి(బడంగ్‌పేట్)లో ఆధిక్యత కనబరిచారు. 14వ రౌండ్ తుక్కుగూడలో విశ్వేశ్వర్‌రెడ్డి ఆధిక్యతను ప్రదర్శించారు. మహేశ్వరం మండలంలో 15వ రౌండ్‌లో కాంగ్రెస్ అధిక్యత, 16, 17 రౌండ్‌లలో బీజేపీ ఆధిక్యతను ప్రదర్శించింది. 18, 19, 20 రౌండ్లు కందుకూరు మండలంలోని బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మెజార్టీ సాధించారు.

ప్రభావం చూపని బీఆర్‌ఎస్

జల్‌పల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యత మినహాయిస్తే, మిగతా అన్ని చోట్ల బీజేపీ హవానే కొనసాగింది. రెండో స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మూడో స్థానంలో నిలిచారు. మొత్తం 20 రౌండ్లలో 16 రౌండ్లలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, 4 రౌండ్లలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి ఆధిక్యతను సాధించారు. కాంగ్రెస్ బడంగ్‌పేట్, మీర్‌పేట్, మహేశ్వరం, కందుకూరు మండలాల్లో ఆధిక్యత ప్రదర్శిస్తుందని హస్తం నేతలు భావించినా ఫలితం అందుకు భిన్నంగా వచ్చింది. బీఆర్‌ఎస్ నుంచి మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నా కారు పార్టీకి ఆశించిన ఓట్లు రాలేదు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి 1,49,527, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి 99,175, బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు 37,215 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి కన్నా బీజేపీ అభ్యర్థికి 50,352 ఓట్లు మహేశ్వరంలో అధికంగా వచ్చాయి.



బీజేపీ నేతల సంబరాలు